


# జూదబ్రహ్మ

పేకాట తనకి తన తండ్రి నించి వారసత్వంగా సంక్రమించిందని కార్తికేయరావు అందరికీ చెబుతుండేవాడు. పేకాటలో అతనిది అందెవేసిన చేయి. కాని అతని దురదృష్ట మేమిటోగాని రెండు 'షో' లు చూపాడంటే వరుసగా నాలుగు కవుంట్లు పడేవి. అందుకే అతను పేకాటలోలాభించడం మాట అటుంచి ఎక్కువగా నష్టపోయే వాడు. ఈ విషయంలో మాత్రం తండ్రి పేరును నిలబెట్టలేక పోయేడు. కార్తికేయరావు తండ్రి గొప్ప జూదగాడు. ఆయన బడి పంతులుగా పనిచేసిన అన్ని వూళ్లలో పేకాట బృందం వారిచే ''జూద కేసరి'' ''జూద శిఖామణి'' ఇత్యాది బిరుదులను పొందాడు. అసలు పేకాట మీదే ఆయన రెండెకరాల పొలం చెక్క సంపాదించాడని అందరూ చెప్పుకుంటారు. ఎదుటి వ్యక్తుల చేతుల్లో ఏయే ముక్కలున్నాయో ఇట్టే చెప్పగల సమర్థుడాయన. పేకాటలో రావడమే గాని పోగొట్టుకొని ఎరగడా తండ్రి కాని ఈ విషయంలో తండ్రి అదృష్టం కొడుకుని వరించలేదు. ఐనా తన ఆఫీసు స్టాపువారిచే ఓ శుభ ముహూర్తాన ''జూదబ్రహ్మ'' అని బిరుదు పొందాడు కార్తికేయరావు.

**ఆ ఇల్లాలికి మొదట్లో భర్త సంగతి తెలీదు. తెలిస్తే అసలు చేసుకోక పోవును.**

జూదబ్రహ్మకి ఏడాదిక్రితం పెళ్లయ్యింది. భార్య పేరు తాయారు. ఆ ఇల్లాలికి మొదట్లో భర్త సంగతి తెలీదు. తెలిస్తే అసలు చేసుకోక పోవును. పెళ్ళి చూపుల నాడు కిటికీలోనించి చూస్తే అందంగానే కనిపించాడు. తర్వాత బుద్ధిమంతుడని, మంచి ఉద్యోగమని, బాగానే జీతం వస్తుందని విని ఠక్కున తల వూపింది. మెడ వంచింది. మూడు ముళ్ళూ వేయించుకుంది. ఆ మూడు రాత్రుళ్ళూ అతను తనతో ఎట్లా గడిపాడో తల్చుకుని కొన్ని రోజులు ఆశ్చర్యంలో మునిగిపోయింది తాయారు తర్వాత

ప్రతాప రవిశంకర్

ఎవరో చెప్పారు అసలు విషయం, ఆ మూడు రాత్రులూ కార్తికేయరావు తప్పించుకుని పేకాటకు పోవటానికి తన శక్తి కొద్దీ ప్రయత్నాలు చేశాడుట. కాని మరిది విషయం తెలిసిన అతని వదినగారు గది దగ్గరే మంచం వేసుకుని అతని పప్పులు వుడక నీయలేదుట. "అమ్మో! పేకాటంటే ఈయనకు ఇంత పిచ్చా!" అనుకుంది గుండెల మీద చెయ్యి వేసుకుని తాయారు

తాయారు కాపురాని కొచ్చిన కొత్తల్లో "మీఆయనకు జూదబ్రహ్మ బిరుదు వుంది" అని ఎవరో చెప్పారు. తన భర్త పేకాటలో అంతటి మొనగాడని విని సంతోషించింది. తర్వాత కొత్త పెళ్ళామన్న జిజ్ఞాసైనా లేకుండా క్షణం తీరిక దొరికినా పేకాటకు పరిగెత్తుతుంటే విసుక్కుంది. కోపం తెచ్చుకుంది ఐనా తన కోపాన్ని బయటకు కనబరచకుండా తన ప్రేమతో అతన్ని పేకాటకు వెళ్లనీయకుండా కట్టి పడేద్దామనుకుంది. ఆ ఆటలు కూడా సాగనివ్వలేదు కార్తికేయరావు.

ఒకసారి ఎందుకో అతను ఆఫీసునించి సాయంత్రం ఐదు గంటలకే ఇంటికి వచ్చాడు. అతన్ని కాఫీ ఫలహారాలతో సత్కరించి దగ్గరగాచేరి ప్రేమనంతా ఒలకబోస్తూ "ఈ రోజు సినిమాకు తీసుకెళ్ళరూ" అని అడిగింది "రెడీ" అన్నాడు కార్తికేయరావు గంపెడంత సంతోషంతో గబగబా వంటచేసి సిద్ధమయింది. ఇద్దరూ రిక్షాలో సినిమా కెళ్ళారు. తన మొగుడు హటాత్తుగా మంచివాడుగా మారిపోతే సంతోషించే తెలుగు సినిమా హీరోయిన్లా పొంగిపోయింది తాయారు. పిక్చరు బిగినయింది. పది నిమిషాల తర్వాత 'ఇప్పుడే వస్తా' అంటూ బయటకు వెళ్ళాడు కార్తికేయరావు. అలా వెళ్ళిన మనిషి సినిమా మరో ఐదు నిమిషాల్లో ఐపోతుందనగా వచ్చాడు.

"ఎక్కడికి వెళ్ళారండీ!" అని అడిగింది కంగారుగా తాయారు. సిగరెట్టు కాల్చుకోడానికి వెళ్ళాడేమోననుకుంది మొదట్లో.

"మా ఫ్రెండ్ రూము ఇక్కడికి దగ్గరే. నాలుగాటలు ఆడి వచ్చానులే" అన్నాడు నవ్వుతూ.


ఆహ్లాదానికి! ఆర్జనకు!! ఇంద్రజాలిక విద్యను నేర్చుకోండి!!!

## ఉజార్స్ ఇంద్రజాల కళాశాలలో చేరండి.

[జంటనగరాలలో ఇంద్రజాలిక విద్యను బోధిస్తున్న ప్రప్రథమ ఏకైక కళాశాల]

మిమ్మల్ని మేము ఇంద్రజాలికులుగా తయారు చేస్తాం.

❀ స్నేహితుల్ని పొందండి!
❀ ధనార్జన చేయండి!!
❀ విఖ్యాతి గాంచండి!!!

☞ వివరాల కోసం 2 రూ॥లు పంపి సంప్రదించండి:

ప్రిన్సిపాల్, ఉజార్స్ కాలేజ్ ఆఫ్ మ్యాజిక్
5-4-367/1 గాంధీభవన్ రోడ్ [ప్రీమియర్ బైక్స్ కంపెనీ ఎదురుగా]
హైదరాబాద్-500 001 ఫోన్: 46748

తాయారుకి నవ్వాలో ఏడ్వాలో అర్థం కాలేదు. 'ఏమిటీ మనిషి' అనుకుంది. పెళ్ళయిన రెండేళ్ళవరకైనా పెళ్ళాన్ని ఏ మొగుడూ నిమిషంకూడా వదలలేడని తను విన్నది అబద్ధమేనా అని వాపోయింది.

ఆ తర్వాత ప్రేమమార్గాన్ని వదిలి కోపమార్గాన్ని చేపట్టింది తాయారు. అలిగి కూర్చునేది. ఆఫీసువేళకి వంట చేసేది కాదు. రోజూ కార్తికేయరావు భోజనంచేసి పావుతక్కువ తొమ్మిది గంటలకే ఇంటినించి బయల్దేరేవాడు. ఓ గంట సేపు ఎక్కడో కూర్చుని పేకాడుకుని పది గంటలకు ఆఫీసుకు వెళ్ళేవాడు. ఈ సంగతి గ్రహించినతాయారు ఓరోజుపదిగంటలవరకు వంట చెయ్యలేదు. రెండురోజులు ఓపిక పట్టిన కార్తికేయరావు మూడో రోజు తొమ్మిది గంటలకే వెళ్ళి హోటల్లో భోజనం చేసి పేకాటకు చక్కా వెళ్ళిపోయేడు. తాయారుకి ఏడుపు వచ్చింది. ఏడుస్తూనే "ఇట్లాగైతే నేను పుట్టింటికి వెళ్ళిపోతాను" అన్నది. అతను మాట్లాడలేదు.

కార్తికేయరావు వచ్చే జీతంలో చాలావరకు పేకాటలోనే తగలేసేవాడు. అప్పుడప్పుడు అప్పులు చేసేవాడు. ఒకసారి అతనిదగ్గర వున్న డబ్బంతా పేకాటలో పోయింది. ఎక్కడా అప్పు దొరకలేదు. చివరికి తాయారు మెళ్ళోవున్న ఒంటిపేట గొలుసు అతనికళ్ళకు కనిపించింది. దాన్ని తీసి యివ్వమని ప్రేమగా తాయార్ని అడిగాడు కార్తికేయరావు. తాయారు యివ్వలేదు. గట్టిగా అడిగాడు. ఇవ్వలేదు. తిట్టినా యివ్వలేదు. "ఇంకొక్క నిమిషంకూడా మీతో కాపురం చెయ్యలేను" అంటూ ఆ రోజే ఓ సూట్కేసులో తన బట్టలన్నీ కూరుకుని రైలెక్కి పుట్టింటికి వెళ్ళిపోయింది.

"ఇదేమిటే తల్లీ? ఉత్తరం ముక్కయినా రాయకుండా వూడిపడ్డావు?" అన్నది తాయారు తల్లి. అసలువిషయం చెప్పలేదు తాయారు. అందర్నీ చూడాలనిపించి వచ్చానని చెప్పింది.

వారం రోజులవరకూ భర్త దగ్గర్నించి ఉత్తరం వస్తుందేమోనని కళ్ళు కాయలు కాచేలా ఎదురు చూసింది. తనని తీసుకెళ్ళటానికి వస్తాడేమోనని ఆశపడింది. కోపం కొద్దీ వచ్చేసిందిగాని తాయారుకు మొగుడంటే ఎనలేని ప్రేమ. అతగాడికీ తనంటే ఇష్టమని తాయారుకు తెలుసు. ఏం మనిషో? ఏమో! వేళకి తిండీ తిప్పలు లేక ఎంత నీరసించిపోయేరో అనుకుంది. తన ముఖం చూడటానికి సిగ్గుపడుతున్నాడేమో అనుకుంది. ఈ ఊహ మదిలో కదలగానే నిమిషంకూడా అక్కడ నిలువబుద్ధి కాలేదు. ఎట్లా వచ్చిందో అట్లాగే పుట్టింటి నుంచి బయల్దేరింది. ఒక్కవుదుటన్న ఇంటికి వచ్చిపడింది

గేటు నెట్టుకొని లోపలకు వచ్చిన తాయారు ముందుగదిలో దృశ్యం చూసేసరికి చేతిలో సూట్కేసు కిందికి జారిపోయింది. గదినిండా సిగరెట్టుపీకలు- ఒకమూల గుండ్రంగా ఆరుగురు మనుష్యులు కూర్చునివున్నారు. అందరి చేతుల్లోనూ పేకముక్కలు. నోట్లో సిగరెట్టు పెట్టుకొని- కుడిచేత్తో పేకముక్క పట్టుకుని- ఎడమ చేతిలోవున్న ముక్కలకేసి ఆలోచిస్తూ తీక్షణంగా చూస్తున్నాడు కార్తికేయరావు.

పేకాట జోరుగా సాగుతోంది. ◆